# 'రూ. పొందిన' పథకం'

'శ్రీ బాలా ట్యుటోరియల్స్' తరవున ఆ వ్యక్తి ఆఖరుగా చెప్పిన మాటలివి. మేమిచ్చిన అవకాశం నిమిషాల మీద మీరు త్రోసిపుచ్చారు. చిన్నతనం వల్లా తొందరపాటువల్ల మీరీ నిర్ణయానికి వచ్చారని ఇంకా నేను అనుకుంటున్నాను. ఇందువల్ల మీకు వచ్చేదేగాని పోయేది ఏమీలేదు. సేల్సుగర్ల్‌గా పనిచేస్తే మీకు నెలకి ఎంత వచ్చేది! ఆ నెల రోజులూ పని చెయ్యడానికి మీరెంతకష్టపడవలసి వచ్చేది! అంతా ఆలోచించుకోండి. అనుకున్నప్పుడల్లా అవకాశాలు గుమ్మంలోకి వచ్చి మీకోసం తొంగి చూడవు. ఒక్క అబద్ధం ఆడమంటున్నాం, అంతేగా! అదైనా అంతా అబద్ధం కాదుకదా... మీకు ర్యాంకు వచ్చిన మాట నిజమేకద! నేను రేపు మళ్ళీ ఇదేవేళకి వస్తాను. ఫొటోగ్రాఫరుని కూడా తీసుకొస్తాను. మిమ్మల్నేదో బలవంతం చేస్తున్నానని అనుకోవద్దు. మా సంస్థ ప్రగతికి మీరు సహకరించగలరనే ఇంకా మా నమ్మకం. వస్తానూ, అన్నీ ఆలోచించుకుని అవునంటారుగా!'

అతను గబగబా నడిచి వెళ్ళిపోయాడో లేదో ఇట్నించి, సూరమ్మగారు వచ్చింది, ఆవిడకి బ్రహ్మచెవుడు.

'ఎవరే రాధా అతను? గంటల కొద్దీ పరాయి మగాడితో ఆ కబుర్లేమిటే?' రాధ విసుగ్గా తల్లి వైపు చూసింది. అంతలో తమాయించుకుని మరో ప్రైవేటు కంపెనీవారు తనని ఉద్యోగం చెయ్యమని అడుగుతున్నారని నచ్చజెప్పి తల్లిని లోపలికి పంపేసింది. మనసులో కలిగిన అలజడి చెమట రూపాన బుగ్గల్నించి కారుతూంటే చెంగుతో తుడుచుకుని సీలింగ్ ఫ్యాను కింద పడక్కుర్చీలో కూలబడింది. కాళ్ళు ఊపుతూ కూచుంది. కాస్సేపటికి రాధ మనసు కుదుటపడింది. తను తీసుకోవలసిన నిర్ణయం తాలూకు పూర్వాపరాలు స్థిమితంగా బేరీజు వేసుకోగల మనస్థాయికి చేరుకుంది.

చెవిటి తల్లితో, గుడ్డి సంఘంతో, ఎక్కడికక్కడ రాజీపడి, ఏదో విధంగా రోజులు వెళ్ళబుచ్చుతోంది రాధ. ఎంతటి దిగువ మధ్యతరగతి జీవితం ఈడుస్తున్నా ఎగసి ఎగసి పడడానికి మనసుకేం ఆటంకం లేదు కదా! ఎలాగో ఇంటరు అయిందనిపించింది, ఎక్కడో చిన్న ఉద్యోగం సంపాదించి కొన్నాళ్ళు బండి లాగించింది. ఏదో విధంగా రోజులు నెట్టుకొస్తూంటే సరేనా, ఏ వయసుకాముచ్చట తీరొద్దా? ఇలా ఓ ఏడాది కో ఏడాది దొర్లిపోతూ ఉంటే ఇక నీకు పెళ్ళెప్పుడే అమ్మాయే? అని తల్లి గుర్తుచెయ్యనక్కర్లేదు, తన మనసులోని కోరికా అదే.

ఆకరికిక ఓ రూపకల్పన కల్పించాడు సుధాకర్. బియ్యే పాసయ్యాడట. మరే ఉద్యోగమూ దొరక్క సర్క్యులేషన్ లైబ్రరీ పెట్టుకున్నాట్ట. వాళ్ళూ చాలా సామాన్య సంసారులు. అతనెప్పుడూ సింపుల్‌గా నీట్‌గా ఉంటాడు. 'జాబ్ చేస్తూ కూడా రోజుకో నవల చదివేస్తున్నారు మీరు. స్కూల్లో చదువూ లేదు, మరో ఉద్యోగమూ లేదు. పుస్తకాలూ పత్రికలూ ప్రత్యేకించి కొనక్కర్లేదు. ఏదో ఓ చెత్త, రోజుకో గంట చదవ్వే అంటే మా చెల్లాయ్ శ్రాముూ వినదు. ఇంకా మా అమ్మేనయం అనుకోండి, సినిమా పత్రికలేనా తిరగేస్తుంది'.

## నన్ను నన్నుగా ప్రేమించి పెళ్ళాడేవాడే నాకు కావాలి

అంటూ ఓనాడు మాట కలిపాడు సుధాకర్. చూపులతోటే తృప్తిపడే స్థాయి మాటలతో ఊపు అందుకుంది. మనసు ఇచ్చిపుచ్చుకునే మనోహర స్థితికి దారి తీసింది.

తాము వేరే అన్ని ఏర్పాట్లూ చేసుకుని ముందు గదిలో సర్దుకుని మిగిలిన ఇల్లు అద్దెకిచ్చేసింది సూరమ్మ గారు. మొగుడు పోయాక అతని వాటా కిందిచ్చిన పొలం అమ్మేసి దాన్తో ఇల్లు బాగు చేయించుకున్నాకే ఈ మూడొందలైనా అద్దె వచ్చేది. పదేళ్ళై ఆ అద్దెకున్నవాళ్ళు మూడొందలే ఇస్తున్నారు. ఇప్పుడు ఏ వెయ్యి పైనో వస్తుందని తెలుసు. అయినా వాళ్ళు కదలరు, అద్దె పెంచరు. ఆ రోజుల్లో అయితే ఎలాగో సరిపెట్టుకునేది. అదే సొమ్ముతో ఈ రోజుల్లో ఎలా! అందులోనే ఆ అమ్మాయి చదువు వెలిగించింది. అది చాలకే ఈ మధ్య కొన్నాళ్ళు పనిచేసింది కూడా ఎలాగో అలా గుట్టుగా నెట్టుకొస్తే అది సరేగాని అందులోనే ఆ ఇల్లు ఉండగానే రాధ పెళ్ళంటే అదెలా!

'ఈ ఇల్లు అమ్మేసి ఆ వచ్చిన డబ్బు ఇంతకట్నమని చూపిస్తాను. అలా అయితే గాని నీకు సంబంధాలు రావు' అని సూరమ్మగారంటే రాధ మండిపడింది.

'అలా వచ్చిన సంబంధాలు నాకొద్దు. ఇల్లమ్మి నన్ను పెళ్ళిచేసి పంపేస్తే నువ్వే చూరుకింద నిలబడదామని? అలా కట్నం పుచ్చుకుని నన్ను పెళ్ళాడే మహామభావుడు నాతోపాటు నిన్నుండని స్తాడని ఎక్కడుంది! ఇంతకీ నన్ను నన్నుగా ప్రేమించి పెళ్ళాడేవాడే నాకు కావాలి. నాకేం తక్కువని!'.

ఇలా తల్లితో వాదించి నోరు మూయించానని కళ్ళు తప్పుకుంటూ ఓ చల్లని వేళ రాధ సుధాకర్‌తో చెప్పి జవాబుకి ఎదురుచూసింది.

'ఏమంటావ్, నాకేం తక్కువ!' అని రెట్టించింది.

'మనలాంటి వాళ్ళకి ఒకటే తక్కువ, అదేమిటో నీకు తెలుసు, డబ్బు!'

'అవును రాధా! మనం ఒకరినొకరం కావాలని అనుకుంటున్నాం. ఎలా పెరిగినా ఎక్కడ తిరిగినా తన చెవుల్ని తనే వింటున్నావా అన్నంత భ్రమతో అతనివైపు ఆశ్చర్యంగా చూసింది.

అవును రాధా! మనం ఒకరినొకరం కావాలని అనుకుంటున్నాం. ఎలా పెరిగినా ఎక్కడ తిరిగినా మన భావాలు అతి సన్నిహితంగా ఉండి ఎంత త్వరగా ఒకటిలో ఒకటి కలసిపోదామా అని ఉవ్విళ్ళూరుతున్నాయి. కాని మనం సినిమాల్లో ప్రేమికులం కాదు. నవలల్లోని లవర్సుమికాదు. ఎంతలేదన్నా మనిద్దరికీ రోజుకి కనీసం సేరు బియ్యం కావాలి. ఇవి కేవలం ఒక రోజుకి మనిద్దరికీ మాత్రమే. నీకు మీ అమ్మా, నాకు మా అమ్మా చెల్లీ ఉన్నారు. వీళ్ళందరి క్షేమం కోరుకునే సామాన్యమానవులం మనం'

'ఇన్ని డొంకతిరుగుడు కబుర్లెందుకూ, కట్నం కోరే కసాయివాళ్ళలో నేనూ ఉన్నానని ఒప్పుకో కూడదూ?'

'ఆ కసాయి స్థాయికి నేను చేరుకున్నానో లేదో నువ్వే చెప్పాలి. నాకు కావలసింది మాత్రం బ్రతకనేర్చిన తనం. కష్టపడి జీవితాలు గడుపుతున్నవాళ్ళం మనం. ఒకర్ని ఒకరు ఇష్టపడ్డవాళ్ళం.

ఇద్దరూ కలిసిన జీవితం కష్టభరితం కాకూడదనే ఆలోచన ముందే చేసుకుంటే తప్పేముంది! నువ్వే తేనక్కర్లేదు, మనిద్దర్లో ఎవరికైనా ఉన్నపాటున లాటరీ వచ్చి ఏ పదివేలో కలిసొస్తే, ఆనాడే మన పెళ్ళి! మా. శ్రామూకి మేనరికం ఉంది. ఈ రోజుల్లో పదివేల కట్నంతో పిల్లని చేసుకునే వాడుంటే అది నిజంగా అదృష్టమే. అదైనా ఆ మాత్రం పెట్టుబడితో వాళ్ళ ఊళ్ళో ఏదో చిన్న షాపు పెట్టుకుంటారట. దానికిచ్చే పదివేలూ మేం కూడబెట్టి శ్రామూ పెళ్ళి అయిందనిపిస్తేగాని మనకి లైన్‌క్లియర్ అవదు. అయామ్ హెల్ప్‌లెస్!



మానవ సంబంధాలన్నీ ఇలా డబ్బుతో బంధింపబడి ఉండడం రాధకి సిగ్గుచేటు అనిపించింది. కాని అది కాదనడానికి వీల్లేనంత కటిక నిజం. 'నేను మెడికల్ ఎంట్రన్స్‌కి ప్రిపేరు అవుతున్నాను. ఆర్నెళ్ళపాటు నాకు శలవివ్వండి?' అని ఆ నాడు తను కాళ్ళావేళ్ళా పడినా తను సేల్సు గరల్‌గా పనిచేసే 'ఇందిరా ఎంటర్‌ప్రైజెస్' వాళ్ళు కనికరించరా! విలుచున్న పళాన్ని ఉద్యోగం ఊడలాగేసిన కాఠిన్యానికి తానేం ఎదురు దెబ్బకొట్టగలిగింది! ఓ సారి చదివింది వెంటనే గుర్తుండిపోయే అద్భుతశక్తి తనికి మొదట్నుంచి ఉన్నదే గనక ఎమ్‌సెట్‌లో తనికి సెక్సెస్ కాకుండా ఏభై ఆరవ ర్యాంకు కూడా వచ్చింది. ర్యాంకుకి కూడా ఖరీదు ఉంటుందని శైలబాలా ట్యుటోరియల్సు మనిషి తనని కలుసుకునే దాకా తెలీదు!

'చూడండి మేడమ్! మీ వీధి చివరనే మా ఎమ్‌సెట్ కోచింగ్ సెంటర్ ఉంది. మీరు ఈ వీధిలో అటూ ఇటూ తిరుగుతూన్న సంగతి అందరూ గుర్తించే ఉంటారు. ఇక మీరు మా సంస్థలో చదువుకున్నట్టు ఎడ్మిషనూ, ఎటెండెన్సూ, రికార్డ్సు మేం సృష్టించుకోగలం. ఇంతకీ ఎవరైనా వెరిఫై చేస్తేమాట. పీకలు తెగిపోయే పోటీని సమాజం ప్రోత్సహించినంత కాలం ఇలాంటివి మామూలే. మాకీ సహాయం చేసినందుకు మీకు పదివేల రొక్కం ముట్టచెబుతాం. ఇదేదో లంచంలా ఉందని మీరు కొట్టిపారేస్తున్నారు. లంచం, కట్నం, బహుమతీ, సైరాబడీ, లాటరీ, రాయితీ, అదనపు సదుపాయం ఇలాంటివన్నీ ఒకటే, లక్ష్మీదేవి నానారూప విలాసాలు'!

ట్యుటోరియల్స్ ఏజెంటు పడిన శ్రమా, చేసిన బోధా ఊరికే పోలేదు. రెండ్రోజులు దాటాక స్థానిక దినపత్రికలో ప్రకటన, రాధ ఫోటోతో సహా వచ్చింది. మా శైలబాలా ట్యుటోరియల్స్ స్థాపించి ఏడాది తిరగకుండానే మా సంస్థ విద్యార్థిని కుమారి రాధ ఎమ్‌సెట్‌లో ఏభై ఆరవ ర్యాంకు సంపాదించి మెడిసిన్ సీటు పొందగలిగింది. మా అధ్యాపకుల శిక్షణ బోధనలకి వేరే రుజువెందుకు! ఇంక ఆరు నెలలు దాటకుండానే కుమారి రాధ, శ్రీమతి రాధాసుధాకర్‌గా మారిందని వేరే చెప్పడమెందుకు?*

అవసరాల రామకృష్ణా రావు